సాక్షి అనకాపల్లి

బుధవారం ¦ 5 ¦ జూన్ ¦ 2024



అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిగింది.



అష్టదళ పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉభయదాతలు పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.3/27.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

తంగేడు రాజకుటుంబీకులకు ఇచ్చిన గౌరవం మరువలేం



- వైఎస్ జగన్‌కు కృతజ్ఞతగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: ఎంఎస్ఎంఈ చైర్మన్ పదవిని అప్పగించి తంగేడు రాజకుటుంబీకులకు గౌరవం ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటామని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు తెలిపారు. అదే విధంగా పాయకరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఓటమికి బాధ్యత వహిస్తూ ఎంఎస్ఎంఈ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. మంగళవారం ఆయన ఎన్నికల ఫలితాల అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. ప్రజల తీర్పును గౌరవించి శిరసావహిస్తున్నట్టు తెలిపారు. ప్రధానంగా కోటవురట్ల మండలంలో వైఎస్సార్ సీపీ మెజార్టీ కోల్పోయినందుకు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించినట్టు తెలిపారు.

పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు



జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రం పరిసరాలలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి వాహనాల రాకపోకలను నియంత్రించారు. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిలో అనకాపల్లి నుంచి మర్రిపాలెం వరకు ఒక వైపు సర్వీసు రోడ్డుపై వాహనాలు రాకపోకల్ని నిలిపేశారు. కేవలం కౌంటింగ్ సంబంధిత వాహనాలను మాత్రమే అనుమతించారు. శంకరం ఏలేరు కాలువ నుంచి బట్లపూడి మీదుగా కౌంటింగ్ సిబ్బంది, రేబాక నుంచి గొలగాం మీదుగా ఏజెంట్లకు, శంకరంలో కలెక్టరేట్ ముఖద్వారం నుంచి అధికారులు, మీడియా వాహనాలను అనుమతించారు. ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సంఘం మంజూరు చేసిన పాస్‌లు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్లేందుకు అనుమతించారు. ఎక్కడా ఎలాంటి సమస్యల్లేకుండా ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ ముగిసింది.

ఈఎన్‌సీలో అవగాహన



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ నేవీ మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధం, నీటి సంరక్షణ, వ్యర్థాలు నిర్వహణ తదితర అంశాలపై కార్యాలయ ప్రాంగణం, నేవీ సిబ్బంది నివాస ప్రాంతాల్లో అవగాహనతో కూడిన వర్క్‌షాపులు నిర్వహించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి. పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహించడానికి వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగం చేయడం, రీసైకిల్ చేయడం, వ్యర్థాలపై పునరాలోచించడం, తిరస్కరించడం, మరమ్మతు చేయడం వంటి సూత్రాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. హైడ్రో కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి వివిధ యూనిట్లు కమాండ్‌లో నో వెహికల్ డేని పాటించారు.

6న విశాఖ–పలాస పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: భద్రతా పనుల కారణంగా పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని రైళ్ల రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సికింద్రాబాద్–సంత్రగచ్చి (07221) ఎక్స్‌ప్రెస్ మంగళవారం మధ్యాహ్నం 12.45 గంటలకు, సంత్రగచ్చి– సికింద్రాబాద్ (07235) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.20 గంటలకు, విశాఖపట్నం–నాందేడ్(20811) ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.30 గంటలకు, షాలిమర్–సికింద్రాబాద్(07226) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారు ఒంటి గంటకు బయలుదేరింది. 6వ తేదీ గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరవలసిన భువనేశ్వర్– చెన్నై (12830)ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా మధ్యాహ్నం 1.40 గంటలకు బయలుదేరుతుంది.

రద్దు చేసిన రైళ్లు

ఈ నెల 6న పలాస–విశాఖపట్నం–పలాస(07471/07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (08522 / 08521) పాసింజర్ స్పెషల్‌ను రద్దు చేశారు.

కూటమికే పట్టం

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 13 స్థానాల్లోనూ గెలుపు
- టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకే ఓటు
- 1999 తర్వాత విశాఖ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకున్న టీడీపీ
- విశాఖ 'రాజధాని' ఆశలపై నీళ్లు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ఓటర్లు కూటమికే పట్టం కట్టారు. ఈ రెండు జిల్లాల్లోని 13 అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులనే గెలిపించారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపు ఆరంభం నుంచి కూటమి అభ్యర్థుల హవా కనిపించింది. ప్రతి రౌండులోనూ వారి ఆధిక్యం కొనసాగింది. చివరకు వారినే గెలుపు వరించింది. విశాఖపట్నం జిల్లాలో ఏడు నియోజకవర్గాలున్నాయి. వీటిలో విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక, భీమిలి స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు, విశాఖ ఉత్తర స్థానం నుంచి కూటమిలో భాగమైన బీజేపీ, దక్షిణ, పెందుర్తిల నుంచి జనసేన అభ్యర్థులు గెలుపొందారు. ఇక అనకాపల్లి జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాల్లో అనకాపల్లి, యలమంచిలి జనసేనకు, పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల స్థానాలు టీడీపీకి పట్టం కట్టారు. ఇలా ఈ రెండు జిల్లాల్లో ఎనిమిది చోట్ల టీడీపీ, నాలుగు చోట్ల జనసేన, ఒక చోట బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. అలాగే విశాఖపట్నం, అనకాపల్లి లోక్‌సభ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచారు.

విశాఖ నుంచి టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, అనకాపల్లి నుంచి బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్‌లకు ఓటర్లు విజయాన్ని అందించారు. కాగా 1999 తర్వాత నుంచి విశాఖపట్నం లోక్‌సభ స్థానం టీడీపీకి దక్కలేదు. 2004, 2009లో కాంగ్రెస్, 2014లో బీజేపీ, 2019లో వైఎస్సార్‌సీపీల అభ్యర్థులే గెలిచారు. 1999లో టీడీపీ నుంచి ఎంవీవీఎస్ మూర్తి ఈ స్థానం నుంచి గెలుపొందగా పాతికేళ్ల తర్వాత ఇప్పుడు ఆయన మనవడు శ్రీభరత్ విజయం సాధించారు. ఇక అనకాపల్లి ఎంపీ సీటును గత 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోగా ఈసారి బీజేపీ దక్కించుకుంది.

రాజధాని ఆశలపై నీళ్లు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తానని ప్రకటించారు. దీనిపై ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ న్యాయపరమైన అనేక అడ్డంకులను సృష్టిస్తూ వచ్చింది. రెండోసారి వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖను రాజధానిగా చేసి ఇక్కడ నుంచే పరిపాలన సాగిస్తానని సీఎం జగన్ స్పష్టం చేశారు. దీంతో త్వరలో విశాఖ రాజధాని కావడం ఖాయమనుకున్న తరుణంలో కూటమి గెలుపుతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. అంతేకాదు.. విశాఖ అభివృద్ధికి బ్రేకులు పడినట్టయింది



పోస్టల్ బ్యాలెట్ పేపర్లను వేరు చేస్తున్న సిబ్బంది



అనకాపల్లి మండలం శంకరంలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది



ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



ఫలితాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్న సిబ్బంది

గెలుపొందిన కూటమి అభ్యర్థులు, పోలైన ఓట్లు, మెజారిటీ వివరాలిలా..

అసెంబ్లీ నియోజకవర్గం	అభ్యర్థి	మెజారిటీ	పార్టీ
విశాఖ తూర్పు	వెలగపూడి రామకృష్ణబాబు	70,877	టీడీపీ
విశాఖ పశ్చిమ	పీవీజీఆర్ నాయుడు	35,184	టీడీపీ
విశాఖ ఉత్తర	పి.విష్ణుకుమార్‌రాజు	47,534	బీజేపీ
విశాఖ దక్షిణ	సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్	64,594	జనసేన
గాజువాక	పల్లా శ్రీనివాసరావు	95,235	టీడీపీ
పెందుర్తి	పంచకర్ల రమేష్‌బాబు	77,188	జనసేన
భీమిలి	గంటా శ్రీనివాసరావు	92,401	టీడీపీ
అనకాపల్లి	కొణతాల రామకృష్ణ	65,764	జనసేన
చోడవరం	కేఎస్ఎన్ రాజు	42,189	టీడీపీ
మాడుగుల	బి.సత్యనారాయణమూర్తి	28,026	టీడీపీ
నర్సీపట్నం	సీహెచ్ అయ్యన్నపాత్రుడు	23,072	టీడీపీ
యలమంచిలి	ఎస్.విజయకుమార్	48,956	జనసేన
పాయకరావుపేట	వంగలపూడి అనిత	43,727	టీడీపీ
లోక్‌సభ నియోజకవర్గం	**అభ్యర్థి**	**మెజారిటీ**	**పార్టీ**
విశాఖపట్నం	ఎం.శ్రీభరత్	5,04,247	టీడీపీ
అనకాపల్లి	సీఎం.రమేష్	2,96,530	బీజేపీ

తొలిసారి అసెంబ్లీకి నలుగురు, పార్లమెంట్‌కు ఇద్దరు

ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలిసారిగా నలుగురు అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి గెలిచిన సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన), యలమంచిలి గెలుపొందిన సుందరపు విజయకుమార్ (జనసేన), పాడేరు, అరకు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున విజయం సాధించిన విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగంలు మొట్టమొదటి సారిగా అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశాన్ని ఈ ఎన్నికల్లో దక్కించుకున్నారు. అలాగే విశాఖ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎం.శ్రీభరత్, అరకు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికైన తనూజారాణి తొలిసారి పార్లమెంట్‌లోకి అడుగు పెట్టబోతున్నారు.

అనకాపల్లి జిల్లాలో అసెంబ్లీ విజేతలు వీరే..

- పాయకరావుపేట నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,07,486 (ఈవీఎం–2,05,346, పోస్టల్ బ్యాలెట్ 2,140) టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితకు 1,20,042 ఓట్లు, సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులుకు 76,315 ఓట్లు వచ్చాయి. మెజారిటీ 43,727
- చోడవరం నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,85,741 (ఈవీఎం–1,83,129, పోస్టల్ బ్యాలెట్–2,612) టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు 1,09,651 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీకి 67,462 ఓట్లు వచ్చాయి. మెజారిటీ 42,189
- అనకాపల్లి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,72,778 (ఈవీఎం–1,70,014, పోస్టల్ బ్యాలెట్–2764) జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు 1,15,126 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు 49,362 ఓట్లు వచ్చాయి. మెజారిటీ 65,764
- మాడుగుల నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,65,221 (ఈవీఎం–1,62,562, పోస్టల్ బ్యాలెట్–2659) టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తికి 91,869 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈర్లె అనురాధకు 63,843 ఓట్లు వచ్చాయి. మెజారిటీ 28,026
- యలమంచిలి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,79,427 (ఈవీఎం–1,77,311, పోస్టల్ బ్యాలెట్–2116) జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు 1,09,443 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి యూవీ రమణమూర్తిరాజుకు 60,487 ఓట్లు వచ్చాయి. మెజారిటీ 48,956
- నర్సీపట్నం నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,73,531. టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడికి 94,550 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు 71,478 ఓట్లు వచ్చాయి. మెజారిటీ 23,072.



కొణతాల రామకృష్ణ
అనకాపల్లి



అయ్యన్నపాత్రుడు
నర్సీపట్నం



సుందరపు విజయకుమార్
యలమంచిలి



వంగలపూడి అనిత
పాయకరావుపేట



బండారు సత్యనారాయణమూర్తి
మాడుగుల



కె.ఎస్.ఎన్.ఎస్.రాజు
చోడవరం



సి.ఎం.రమేష్
అనకాపల్లి

- జగన్ వెంటే గిరిజనం

వైఎస్సార్‌సీపీ విజయదుందుభి

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. రంపచోడవరం మినహా పాడేరు, అరకు అసెంబ్లీల్లో ఘన విజయం సాధించారు. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి గిరిజనులు జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు మూడు సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకు అసెంబ్లీలకు ఆ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ఏజెన్సీని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. వైద్య, విద్యారంగాలతోపాటు మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణం, వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. పాలనను మరింత చేరువ చేయడంతో ఆకర్షితులైన గిరిజనులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు విజయం అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

- అరకు, పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ స్థానాల్లో ఘన విజయం
- 2014 నుంచి ఇప్పటివరకు ఆ పార్టీ అభ్యర్థులకే పట్టం
- అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించిన గిరిజనం
- పాడేరు అభ్యర్థి విశ్వేశ్వరరాజుకు 19,338, అరకు అభ్యర్థి మత్స్యలింగంకు 31,877 ఓట్ల మెజారిటీ
- అరకు ఎంపీ గుమ్మా తనూజారాణికి 50,580 ఓట్ల ఆధిక్యత





అరకులోయ అసెంబ్లీ ఆర్వో అభిషేక్, పాడేరు అసెంబ్లీ ఆర్వో భావన వశిష్ట నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రాలను స్వీకరిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పార్వతీపురంలో అరకు పార్లమెంట్ ఆర్వో నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి

పాడేరు: వైఎస్సార్‌సీపీ వరుస విజయాలతో దూసుకుపోతోంది. 2014 నుంచి ఇప్పటివరకు మూడు సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో హ్యాట్రిక్ నమోదైంది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి నేటి వరకు వరుసగా మూడు సార్లు విజయం సాధిస్తూ వస్తోంది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో గిరిజనులు ఆదరిస్తూ అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో పాడేరు నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారు. ఆ పార్టీ తరఫున 2014 ఎన్నికల్లో పోటీచేసిన గిడ్డి ఈశ్వరి, 2019 ఎన్నికల్లో బరిలో నిలిచిన కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విజయం సాధించారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సుమారు 19,338 ఓట్లతో ఘన విజయం సాధించారు.

అరకులోయలో..

అనంతగిరి: ఆంధ్రా ఊటీ అరకులోయ నియోజకవర్గంలోని ఆరు మండలాల గిరిజనులు జగనన్న రుణం తీర్చుకున్నారు. అరకు అసెంబ్లీకి వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేసిన రేగం మత్స్యలింగంను గెలిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ నియోజకవర్గం 2009లో ఏర్పాటుకాగా ఇప్పటివరకు నాలుగుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సార్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒక్కసారి మాత్రమే టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ అరకులోయ అసెంబ్లీకి టీడీపీ నుంచి పోటీచేసిన సివేరి సోమ గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి వంజంగి కాంతమ్మకు 34,557, టీడీపీ అభ్యర్థి సివేరి సోమకు 34,959 ఓట్లు రాగా 402 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు.

మూడు దఫాలుగా వైఎస్సార్‌సీపీ..

2014 నుంచి ఇప్పటివరకు మూడు సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు గిరిజనులు పట్టం కట్టారు.

- 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ వైఎస్సార్‌సీపీ నుంచి పోటీచేసిన కిడారి సర్వేశ్వరరావు అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. టీడీపీ అభ్యర్థి సివేరి సోమకు 29,647, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిడారి సర్వేశ్వరరావు 63,700 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రత్యర్థిపై 34,053 అత్యధిక మెజారిటీతో సర్వేశ్వరరావు గెలుపొందారు.
- 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా అదేపార్టీకి చెందిన అసెంబ్లీ అభ్యర్థి చెట్టి పాల్గుణ ఘన విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థి కిడారి శ్రావణ్ కుమార్‌కు 19,929, స్వతంత్ర అభ్యర్థి సియ్యారి దొన్నుదొరకు 27,660, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెట్టి పాల్గుణకు 53,101 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రత్యర్థులపై 25,441 మెజారిటీతో పాల్గుణ పదవిని కైవసం చేసుకున్నారు.
- ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై గిరిజనులు ఎనలేని ప్రేమను చూపించారు. ఆ పార్టీ తరఫున పోటీ చేసిన రేగం మత్స్యలింగంను అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ఆయనకు 65,658 ఓట్లు రాగా ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావుకు 33,781 ఓట్లు వచ్చాయి. మత్స్యలింగానికి 31,877 ఓట్ల మెజారిటీ లభించింది.

అరకు ఎంపీ స్థానానికి వరుసగా మూడు సార్లు..

అరకు పార్లమెంట్‌కు 2014 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఆ పార్టీ తరఫున 2014లో పోటీ చేసిన కొత్తపల్లి గీత, 2019లో పోటీచేసిన గొడ్డేటి మాధవి విజయం సాధించారు. ఇప్పుడు గుమ్మా తనూజారాణి 50,580 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.

గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో తనను గెలిపించిన పాడేరు ఓటర్లు,పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని పాడేరు ఎమ్మెల్యే గా ఎన్నికైన మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పాడేరు అసెంబ్లీ బరిలో నిలిపిన తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి వినూత్న కార్యక్రమాలు అమలుజేసిందని, గిరిజనులు మాత్రం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో లేకపోయినప్పటికీ తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గిరిజనుల సమస్యలు పరిష్కారంమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా

రేగం మత్స్యలింగం

సాక్షి,పాడేరు: జిల్లాలోని మెజారిటీ గిరిజనులంతా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే కోరుకోవడంతో భారీ మెజారిటీతో విజయం సాధించానని అరకులోయ ఎమ్మెల్యేగా ఎన్నికైన రేగం మత్స్యలింగం అన్నారు.ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు అరకులోయ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని,ఆయనపై ఉన్న నమ్మకంతోనే అరకులోయ ఓటర్లను తనను గెలిపించారని తెలిపారు.అయితే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి పరిపాలన అందించిందన్నారు.అధికారంలోకి రాకపోవడం బాధగా ఉన్నప్పటికీ తమ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సమస్యలు పరిష్కారానికి పోరాడుతానన్నారు.



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి

సిరులతల్లికి లక్ష కుంకుమార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10వేలు చెల్లిస్తే.. వారి తరఫున నలుగురు దంపతులను అనుమతించనున్నట్టు ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని చెప్పారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలపై పిడుగుపాటు

- విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కొత్త అగ్రహారం వీధికి చెందిన దుమ్ము పోలరాజు పిడుగుపాటుకు గురై మరణించాడు. అతనితో పాటు మరో నలుగురు పడవపై పనులు చేస్తుండగా.. పిడుగుపాటుకు గురయ్యాడు.
- ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటకు చెందిన కంబాల ముత్యాలు (48) సముద్రం తీరంలో పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. వర్షం పడుతున్న సమయంలో పడవ, ఇంజిన్, వలలను సురక్షితంగా తరలించడానికి వెళ్లిన సమయంలో ప్రాణాలు విడిచాడు.
- పద్మాపురం పంచాయతీ కేంద్రంలో హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ గూనగుమ్మి గ్రామానికి చెందిన గెమ్మెలి రంగారావు పిడుగుపాటుకు మృతి చెందాడు. పద్మాపురంలో వాలీబాల్ మ్యాచ్‌ను తిలకిస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఇవీ ఇటీవల జరిగిన ఘటనలు.



విశాఖలో ఉరుములు మెరుపులు

- కాలంతో సంబంధం లేకుండా వర్షాలు.. ఉష్ణోగ్రతల్లో మార్పు
- ఉరుములు, పిడుగులతో అప్రమత్తం
- అజాగ్రత్తతో ప్రాణానికే ముప్పు రావచ్చు

మహారాణిపేట/రాజవొమ్మంగి: ఒకవైపు అకాల వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఒకే రోజు తీవ్రమైన ఎండలు, అంతలోనే భారీ వర్షాలు.. విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో వస్తున్న మార్పులతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎండ వేడితో అల్లాడిన ప్రజలు వానలు, వర్షాలు అనేటప్పటికి సరదా పడడం, వానలో చిందులేయడం సహజం. అంతవరకు బాగానే ఉన్నా ఈ సరదాలో మునిగి అప్రమత్తతను మరువకూడదు. విపరీత వాతావరణ పరిస్థితుల్లో ఎప్పుడు ఏ రకం వానలు కురుస్తాయో తెలియని పరిస్థితి. భారీ వర్షాలు కురిస్తే వాటితోనే ఉరుములు, మెరుపులు, పిడుగులు సహజంగానే వస్తాయి. ఆ ఆందోళన కలిగించే పరిస్థితులను తేలిగ్గా తీసుకుని సరదాగా తడుస్తామంటే మూల్యం చెల్లించుకోక తప్పదు. పిడుగులకు బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతో పాటు జంతువులూ చనిపోతాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. అధికంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులే పిడుగుపాటుకు సమిధలుగా మారుతుంటారు. పిడుగు పడే ప్రాంతాలపై విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా.. నష్టం జరుగుతూనే ఉంది. అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడ వచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

పిడుగు అంటే..

ఆకాశం కారుమబ్బులతో నిండినప్పుడు మబ్బు పైభాగంలో ధన శక్తి, కింది భాగంలో రుణ శక్తి ఉంటాయి ఈ రెండు ఆకర్షణకు లోనై అత్యధిక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. చుట్టూ ఉన్న గాలిలో సుమారుగా 30 వేల డిగ్రీల సెంటీగ్రేడ్ ఉత్పత్తి అవుతుంది. అదే మెరుపు. ఇలా వేడెక్కిన గాలి ఒక్కసారిగా వ్యాకోచం చెందితే పెద్ద శబ్దం వస్తే అదే ఉరుము. ఒక్కోసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతుంది. దాన్నే పిడుగు అంటారు. చర్మం జలదరింపునకు గురవుతున్నా.. దగ్గర్లో లోహ వస్తువులు ఊగుతున్నా పిడుగుపాటుకు సంకేతంగా భావించాలి.

మిలియన్ మెగావాట్ల శక్తి

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లకూడదు. మెరుపు లేదా పిడుగు కాంతిని చూసే ప్రయత్నమూ చేయకూడదు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

సమయస్ఫూర్తి అవసరం

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. వీలుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి.. మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. తలపెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవడం వలన సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అనిపించినప్పుడు రబ్బర్ చెప్పులు ధరించడం మంచిది. ఒక వేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా అనించకుండా, కాలివేళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ పరికరాలకు నష్టం

పిడుగుపడినప్పుడు విద్యుత్ పరికరాలకు ఎక్కువ నష్టం జరిగే అవకాశముంటుంది. ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలైన టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించకపోవడం ఉత్తమం. అలాగే మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయరాదు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు అధికం.



మార్చురీ వద్ద రోదిస్తున్న పోలరాజు తల్లి, బంధువులు

ఈ జాగ్రత్తలు పాటించాలి

- సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపైనే పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. అందుకే వర్షం పడుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎత్తైన చెట్లు, సెల్‌టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, విద్యుత్ స్టవ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించరాదు.
- వర్షం కురిసినప్పుడు విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉరుములతో కూడిన వర్షం వస్తున్నప్పుడు నీటితో కూడిన పనులు చేయరాదు.
- గుంపులుగా ఉండకుండా దూరంగా ఉండాలి. ముఖ్యంగా పొలాల్లో పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం వంటివి చేయరాదు.
- ప్రయాణాలు చేయకపోవడం మంచిది. చెరువులు, ఈతకొలనుల వంటి బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలి.
- పిడుగు పడిన సందర్భాల్లో ముఖ్యంగా శరీరంపై కాలిన గాయాలు కావడం, గుండెపోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు కూడా వినిపించకపోవడం జరుగుతుంది. అటువంటివి జరిగినపుడు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

అప్రమత్తత అవసరం



వర్షాలు కురుస్తున్న సమయంలో ఎత్తైన ప్రదేశాలకు, చెట్ల కిందకు వెళ్లరాదు. పిడుగు పడే సమయంలో బహిరంగ ప్రదేశంలో భూమిపై కూర్చోవాలి. కూర్చున్న సమయంలో చెవులు మూసుకోవాలి. ధ్వని శబ్దం గుండెకు చేరకుండా జాగ్రత్తపడాలి. సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి. సెల్ఫోన్స్ వాడకూడదు. వీలైనంత త్వరగా ఇళ్లకు చేరుకోవాలి. జాగ్రత్తల విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు ఉంటుంది.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్యాధికారి, విశాఖపట్నం

మూగజీవాలను కాపాడాలి



విపత్తుల నిర్వహణ సంస్థ పిడుగులపై హెచ్చరికలు జారీ చేస్తే ముందుగానే జాగ్రత్త పడాలి. వాతావరణ పరిస్థితులను బట్టి వెంటనే అప్రమత్తం కావాలి. పశువులు, ఇతర జీవులను చెట్ల కింద ఉంచకూడదు. రైతులు సైతం చెట్లకు దూరంగా ఉండాలి. సురక్షిత ప్రాంతంలో ఉండాలి. పిడుగు పడి కొనఊపిరితో పశువుకు సెలైన్ ఎక్కించాలి.

– డాక్టర్ తరుణ్, పశు వైద్యశాఖాధికారి, రాజవొమ్మంగి



• బోసిపోయిన రహదారులు



నిత్యం రద్దీగా ఉండే విశాఖ నగర రహదారులు మంగళవారం ఉదయం బోసిపోయాయి. ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలంతా ఇళ్లల్లో టీవీలకు అతుక్కుపోవడంతో రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. మధ్యాహ్నానికి ఫలితాల సరళి తెలియడంతో పనులన్ను వారు రోడ్లపైకి వచ్చారు. సాయంత్రం యథావిధిగా రోడ్లు జనాలతో దర్శనమిచ్చాయి.

మామిడి లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా



గోస్తనీ నది వంతెనపై మామిడి లోడుతో బోల్తా పడిన వ్యాన్



వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ విఘ్నేష్‌ను వెలుపలకు తీస్తున్న సిబ్బంది

తగరపువలస : స్థానిక గోస్తనీ నదిపై గల జాతీయ రహదారి వంతెనపై మంగళవారం మధ్యాహ్నం మామిడికాయల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు మామిడికాయల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ వంతెన పైకి చేరుకుంటున్న సమయంలో సేలం ప్రాంతానికి చెందిన డ్రైవర్ విఘ్నేష్ నిద్రమత్తు కారణంగా డివైడర్‌పైకి చేరి వంతెన గోడను ఢీకొట్టాడు. దీంతో ఐషర్ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో అందులోని మామిడికాయలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదం జరిగే ముందు ఆవును తీసుకెళ్తున్న మరో వ్యాన్‌ను ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. ఐషర్ వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ విఘ్నేష్ కాలు ఇరుక్కుపోయింది. దీంతో భీమిలి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది, తాళ్లవలస అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని శ్రమించి విఘ్నేష్‌ను బయటకు తీశారు. ముందు వ్యాన్‌లో ఉన్న ఆనందపురం మండలం వేమగొట్టిపాలేనికి చెందిన ఆదినారాయణ, మరో వ్యక్తికి గాయాలు కావడంతో ముగ్గురిని సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎట్టకేలకు ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

మధురవాడ: మానసిక పరిస్థితి సరిగా లేక ఓ వివాహిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించిన పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం చీడిపూడి గ్రామానికి చెందిన కుదుసు భాస్కర్‌రావుకు కుమారుడు, కుమార్తె యమున సంతానం. లక్ష్మీపురం గ్రామానికి చెందిన యయాతికి తన కుమార్తెనిచ్చి 2017లో వివాహం జరిపించాడు. భార్యాభర్తలిద్దరూ రెండేళ్లుగా కొమ్మాది రిక్షా కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి భవశ్రీ(7), దేవశ్రీ(4) కుమార్తెలు ఉన్నారు. యయాతి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. యమున కొద్ది కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతోంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గుర్తించిన స్థానికులు తండ్రికి ఫోన్ చేసి విషయం తెలిపారు. ఆయన వెంటనే బంధువులతో కలిసి ఇక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో ఆమె భర్త లేరు. తన కుమార్తె మృతిపై ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు భాస్కరరావు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి వీసం రాజీనామా

నక్కపల్లి : ఈ దఫా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘోర పరాజయం పాలైనందుకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి, ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీసం రామకృష్ణ ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామన్నారు. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా వైఎస్సార్‌సీపీ ఘోర పరాజయం పాలవడం బాధాకరమన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.15.77 లక్షల చోరీ

దేశపాత్రునిపాలెంలో ఏటీఎంను దగ్ధం చేసిన దుండగులు



చోరీకి గురైన ఏటీఎంను పరిశీలిస్తున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ



దుండగులు దగ్ధం చేసిన దేశపాత్రునిపాలెంలోని ఎస్‌బీఐ ఏటీఎం

పరవాడ: దేశపాత్రునిపాలెంలో ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారని సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. చోరీకి సంబంధించి సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఏటీఎం మిషన్‌ను గ్యాస్ కట్టర్‌తో తొలగించి అందులో భద్రపర్చిన రూ.15,77,300 లక్షల నగదు దోచుకున్నారు. అనంతరం ఏటీఎం మిషన్‌తో పాటు ఏసీని తగలబెట్టారు. చోరీకి గురైన ఏటీఎంను పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ మంగళవారం సందర్శించి చోరీకి సంబంధించిన వివరాలను సీఐ బాలసూర్యారావును అడిగి తెలుసుకున్నారు. ఏటీఎంను క్లూస్‌టీం పరిశీలించింది. ఏటీఎం నిర్వాహకుడు పాలకుర్తి శ్రీనివాసఅప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం



చోరీకి ప్రయత్నించిన ఏటీఎం కేంద్రం

కోటవురట్ల: మండలంలోని నరసింగపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనానికి విఫల యత్నం జరిగింది. సీఐ ఎం.వినోద్‌బాబు అందించిన వివరాలివి. జాతీయ రహదారి పక్కనున్న భారతీయ స్టేట్ బ్యాంకుకు చెందిన ఏటీఎం కేంద్రంలోకి మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు తస్కరించడానికి మిషన్ పగుల గొట్టడానికి ప్రయత్నించారు. అది పగలకపోవడంతో వారు ఉడాయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

సెలవుతో సందర్శకులు లేక వెలవెల పోయిన శిల్పారామం



సదర్శకులు లేక వెలవెల బోయిన శిల్పారామం

పీఎం పాలెం (విశాఖ) : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తున్న సందర్భంగా శిల్పారామం (జీతర)కు మంగళవారం సెలవు ప్రకటించారు.సాయంత్రం అయ్యే సరికి సందర్శకులతో సందడిగా కనిపించే శిల్పారామం మంగళవారం సాయత్రం పిట్ట మనిషి లేక పోవడంతో వెలవెల బోయింది. వాటర్ పార్కువద్ద వందలాదిమంది బాల బాలికలు ఈత కొలనులో కేరింతలు కొట్టేవారు.ఆందడి కొరవడింది. సెలవు కారణంగా వాటర్ పార్కు దాదాపుగా నిర్మానుష్యంగా మారింది. బుధవారం యదావిధిగా ఉదయం 9 గంలనుంచి సాయంత్రం 9 గంటల మధ్యలో సందర్శకుకు ప్రవేశం కల్పిస్తామని ఈ సందర్భంగా సానిక పరిపాలన అధికారి టీ.విశ్వనాథరెడ్డి తెలిపారు.

చెరకు సాగుకు వర్షాలు అనుకూలం



శాస్త్రవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు

అనకాపల్లి : వర్షాధార చెరకు వేసుకునే రైతులు, రాగల వర్షాన్ని వినియోగించుకుని ముదురు గడల నుంచి విత్తనాన్ని సేకరించుకుని ఎకరాకు 20 వేలు మూడుకళ్ల ముచ్చెల చొప్పున 60 సెం.మీ దూరంలో నాటుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం డాక్టర్ ఏడీఆర్ పి.కె.వి. జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు నాటేముందు ముచ్చెలను 10 శాతం సున్నపు నీటిలో ఒక గంట సేపు ముంచి నాటుకోవాని, ఎకరాకు 1.25 టన్నుల చొప్పున చెరకు చెత్తను నాటిన మూడో రోజున కప్పాలని ఆయన చెప్పారు. చెరకు మొక్కతోటలో తీగజాతి కలుపు సమస్య ఉన్నట్టయితే, నాటిన 75 రోజులకు ఆల్మిక్స్ ఎకరానికి 8 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా తడిచేలా పిచికారి చేసుకోవాలని ఆయన తెలిపారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని వరినారుకు నేల తయారు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎక్కడైనా పచ్చిరొట్ట పైరును విత్తుకోని రైతులు, తేమను చూసుకుని జనుము, జీలుగ, పిల్లిపెసర, అపరాలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, ఎం.విశాలాక్షి, ఎ.శిరీష, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మాస శివరాత్రి పూజలు

అనకాపల్లి: స్థానిక శారదానది ఒడ్డున బుధవారం ఉదయం 10 గంటలకు మాస శివరాత్రి సందర్భంగా ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో లలితా శివ సహస్ర నామ పారాయణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సాలగ్రామ రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు నేడు

అనకాపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై మూడు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

బీజేపీకి రానున్నది గడ్డుకాలమే..



శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: దేశంలో బీజేపీకి రానున్నది గడ్డు కాలమే అని, వారి పాలనకు రానున్న రోజుల్లో నూకలు చెల్లినట్టే అని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1209వ రోజు, మంగళవారం వారు మాట్లాడారు. తిరుగులేని అధికారంతో విర్రవీగిన బీజేపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి లాభాల బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి, నాశనం చేయాలని చూశారన్నారు. వారికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, ఎన్‌డీఏ పక్షాలు కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోకపోతే పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరావు, ఎంఎంఎస్ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

రోడ్లు వెలవెల

సబ్బవరం: ఎన్నికల కౌంటింగ్ వేళ సబ్బవరం మండలంలోని పలు రోడ్లు వెలవెల బోయాయి. వాహనాల రాకపోకలు లేక మంగళవారం రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎన్నికల ఫలితాలు వెలవడడంతో ప్రతి ఒక్కరూ టీవీలకు హత్తుకుపోయారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 8 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,100	5,100
రెండో రకం	4,060	4,350
మూడోరకం	3,410	4,000

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్ మీ	: షిర్డిసాయి
హిట్ లిస్ట్	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
బాక్	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

ఎన్నికల లెక్కింపు చిత్రాలు






అనకాపల్లి శంకరంలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

కొణతాల విజయకేతనం

- 65,764 ఓట్ల మెజార్టీతో విజయం
- మూడో స్థానం కాంగ్రెస్, నాలుగో స్థానంలో నోటా



అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడయ్యాయి. అనకాపల్లి ఎమ్మెల్యేగా జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌పై 65,764 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మినహాయించి 18 రౌండ్ల లెక్కింపులో కొణతాల రామకృష్ణకు 1,13,185 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు 48,652 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్లలో కొణతాలకు 1941 ఓట్లు, మలసాలకు 710 ఓట్లు వచ్చాయి. ఈ మొత్తం కలిపితే కొణతాల 1,15,126 ఓట్లు, మలసాల 49,362 ఓట్లు దక్కించుకున్నారు.

అనకాపల్లి మండలం శంకరం పంచాయతీలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ ఆవరణలో మంగళవారం ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరిగింది. మొత్తం 18 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. లెక్కింపునకుగాను 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఉత్కంఠగా సాగిన ఎన్నికల ప్రక్రియలో విజయం సీనియర్ నాయకుడు కొణతాలనే వరించింది. మలసాల భరత్‌కుమార్ అన్ని రౌండ్లలో పోటీనిచ్చారు. నియోజకవర్గంలో 2,13,714 మంది ఓటర్లు ఉన్నారు. మే 13న 251 పోలింగ్ స్టేషన్లలో నిర్వహించిన ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా 1,70,014 మంది, పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 2,764 మంది కలిపి మొత్తం 1,72,778 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అనకాపల్లి నియోజకవర్గ ఓటర్లు **2,13,714** మంది
ఈవీఎంల ద్వారా ఓట్లు **1,70,014**
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు **2,764**
మొత్తం పోలైన ఓట్లు **1,72,778**

నియోజకవర్గం నుంచి 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఇందులో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు. మిగిలిన 10 మంది జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు. ఓట్ల పరంగా తొలి రెండు స్థానాల్లో జనసేన, వైఎస్సార్‌సీపీ నిలవగా, మూడో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఐఆర్ గంగాధర్ 1,895 ఓట్లు సాధించుకున్నారు. నోటా తర్వాత బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థి సూదికొండ మాణిక్యాలరావు 1,306 ఓట్లతో ఐదో స్థానంలో ఉన్నారు. ప్రజా ప్రస్థానం పార్టీ అభ్యర్థి తోట వెంకటసాయి ముకుంద్ అతి తక్కువగా 229 ఓట్లను మాత్రమే దక్కించుకున్నారు. ఈయన కంటే స్వతంత్ర అభ్యర్థులు కాస్త ఎక్కువ ఓట్లు సాధించారు.

పోస్టల్ బ్యాలెట్లలోనూ మెజార్టీ

అనకాపల్లి అసెంబ్లీ పరిధిలో పోస్టల్, సర్వీస్ ఓట్లలో కూడా జనసేన అభ్యర్థి కొణతాలకే మెజార్టీ ఓట్లు వచ్చాయి. 2,764 పోస్టల్ బ్యాలెట్లలో కొణతాలకు 1,941, మలసాల భరత్‌కుమార్‌కు 710 ఓట్లు వచ్చాయి.

నోటాకు నాలుగో స్థానం

ఈ ఎన్నికల్లో నోటా తన ప్రాధాన్యతను చాటుకుంది. అభ్యర్థులెవరూ నచ్చకపోయినా, ఓటింగ్ శాతం పెంచే దిశగా ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన నోటాకు ఈసారీ చాలా మంది జై కొట్టారు. జనసేన, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ తర్వాతి స్థానంలో అత్యధిక ఓట్లు(1853) వచ్చింది నోటాకే. ఇందులో 26 పోస్టల్ బ్యాలెట్లు కూడా ఉన్నాయి. మిగిలిన 8 మంది అభ్యర్థులు నోటాకు వచ్చినన్ని ఓట్లను కూడా సాధించలేకపోయారు.

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీల ఓట్ల వివరాలు

రౌండ్	వైఎస్సార్ సీపీ	జనసేన	మెజార్టీ (జనసేన)
1.	3289	4342	1053
2.	3636	5507	1871
3.	3354	5705	2351
4.	2698	6217	3519
5.	3010	5925	2915
6.	3403	6089	2686
7.	2900	6362	3462
8.	2395	5896	3501
9.	2299	6097	3798
10.	2857	6667	3810
11.	2920	5882	2962
12.	2381	6036	3655
13.	2038	5906	3868
14.	1916	6331	4415
15.	1822	6117	4295
16.	2291	8743	6452
17.	2280	7829	5549
18.	2898	7065	4167
పోస్టల్ బ్యాలెట్లు	710	1941	1231
మొత్తం	49,362	1,15,126	65,764

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణకు కృషి చేసిన శ్రీరాములను తెలుగు జాతి మర్చిపోదన్నారు. ఆయన జ్ఞాపకార్థం నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా పేరు పెట్టి 16 ఏళ్లయిందన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి ఘన నివాళులర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకులు పిరట్ల నరసింహమూర్తి, ప్రతినిధులు గుంగుపాం నాగేశ్వరరావు, లక్ష్మి, స్వాతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా కశింకోట పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజానీకం సూర్య తాపంతో మంగళవారం సతమతమయ్యారు. కొద్ది రోజులుగా చల్లగా ఉన్న వాతావరణం మంగళవారం మళ్లీ వేడెక్కింది. ఒక్కసారిగా వేసవి ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు విలవిల్లాడారు. ఒక వైపు ఉష్ణోగ్రత, మరో వైపు ఎన్నికల ఓట్ల లెక్కింపుతో ప్రజలు టీవీల ముందు అతుక్కుపోయి ఇళ్లకే పరిమితం కావడంతో కశింకోటలోని పంచాయతీ ప్రధాన రహదారితోపాటు, వీధులన్నీ జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం ఉష్ణ తాపం తగ్గడంతో ప్రజలు తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

సత్తా చాటని స్వతంత్రులు

- ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపని అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా అందరి డిపాజిట్లు గల్లంతు
- 8 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు

యలమంచిలి రూరల్ : యలమంచిలి ఎన్నికల బరిలో 10 మంది అభ్యర్థులు పోటీ చేయగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు మినహా మిగిలిన 8 మంది అభ్యర్థులు పెద్దగా ఓట్లు సాధించలేదు. యలమంచిలి నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ 48,267 ఓట్ల మెజార్టీతో గెలవగా అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు)కు 59813 ఓట్లు వచ్చాయి. పోటీ చేసిన 10 మందిలో 8 మందికి డిపాజిట్లు గల్లంతయ్యాయి. పోలయిన ఓట్లలో ఆరో వంతు ఓట్లు వస్తే డిపాజిట్ దక్కుతుంది. కానీ ఎవరికీ ఆ మేరకు ఓట్లు రాకపోవడంతో డిపాజిట్లు దక్కలేదు. విశేషమేమిటంటే బరిలో ఉన్న 8 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. నోటాకు 2400 ఓట్లు పడగా మిగిలిన అభ్యర్థులందరికీ అంతకంటే తక్కువే వచ్చాయి. యలమంచిలి నియోజకవర్గంలో ఎన్నికల బరిలో నిలిచిన వారిలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తనకాల అనంత రామ నరసింగరావుకు 1822, బీఎస్పీ అభ్యర్థి లంబ శ్రీనివాసరావుకు 1414, పిరమిడ్ ఆఫ్ ఇండియా అభ్యర్థి బి.అమ్మాజమ్మకు 352, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుందరపు అరుణ్ కుమార్‌కు 1252, దాడి పూర్ణ చంద్రరావు (జై భారత్ నేషనల్ పార్టీ)కు 490, బోజా నాగేశ్వరావు(రీఫామ్స్ పార్టీ ఆఫ్ ఇండియా)కు 633, స్వతంత్ర అభ్యర్థులు ప్రగడ అన్నపూర్ణకు 450, మొల్లేటి రమేష్‌కు 675 ఓట్లు పోలయ్యాయి. యలమంచిలి నియోజకవర్గంలో 1,79,427 ఓట్లు చెల్లుబాటయ్యాయి. ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు అభ్యర్థులు మినహా మిగిలిన వారందరికీ నోటా కంటే తక్కువ రావడం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

చురుగ్గా భవన నిర్మాణం



భవనం పనులు జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ నూతన భవనం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ భవన నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికి అదనపు నూతన భవనం కోసం నిధులు మంజూరు కావడంతో పనులు చకచక జరుగుతున్నాయి. ఈ భవనం పనులు పూర్తయితే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు తొలగినట్టే.

భారీ వాహనాల రాకపోకలపై చర్యలేవీ..?



మునగపాక మెయిన్‌రోడ్డులో భారీ వాహనం

మునగపాక : పూడిమడక రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారి దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని ఇటీవల వీఎంఆర్‌డీఏ ద్వారా శాశ్వత మరమ్మతుల పేరిట అభివృద్ధి చేశారు. అయితే భారీ వాహనాలకు ఈ మార్గంలో ప్రయాణం నిషేధం ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మెరుగుపడుతున్న సాగునీటి వనరులు



ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి చెందిన కాలువ

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పథకం ద్వారా కాలువలు, చెరువులతో పాటు రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. గతంలో వ్యవసాయ రంగానికి అవసరమయ్యే సాగునీరు ప్రవహించేందుకు కాలువలు అధ్వానంగా ఉండేవి. దీంతో రైతులు సాగుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఉపాధి హామీ పథకం ద్వారా నేడు పలు సాగునీటి కాలువలు అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అవసరమయ్యే నీరు కాలువలు, చెరువుల పుణ్యమాని అందుతుండడంతో ఈ పథకం మేలు చేస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

12 నుంచి 'మిషన్ లైఫ్'

- ఎకో క్లబ్స్ ద్వారా పాఠశాలల్లో పర్యావరణ చైతన్య కార్యక్రమాలు
- ఏపీఎస్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ ఖగేశ్వరరావు



అగనంపూడి: ఏపీఎస్‌జీసీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతీ పాఠశాలలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించాలని ఏపీఎస్‌జీసీ అనకాపల్లి జిల్లా కో-ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా ఎస్‌పీడీ ఆదేశాలు, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచనల మేరకు పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ద్వారా నిర్వహించాలని కోరారు. వీటిలో భాగంగా 5వ తేదీన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, వస్తువులు వాడకుండా ఉండడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించడం, మొక్కలు నాటడం చేయాలని తెలిపారు.

ఇదీ షెడ్యూల్

- 12వ తేదీన నీటిని ఆదా చేయడం, పాఠశాలల్లోని పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టడం, నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించడం, నీటి సంరక్షణ అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు.
- 13వ తేదీన శక్తిని ఆదా చేయడం, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, ఎనర్జీ టీమ్‌లు, క్లబ్‌లు ఏర్పాటు చేయడం, పోస్టర్లు, బ్యానర్లు తయారు చేయాలన్నారు.
- 14వ తేదీన వ్యర్థాలను తగ్గించడం, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో డస్ట్‌బిన్‌లు వాడడం విద్యార్థులకు అలవాటు చేయడం, శానిటరీ వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువులు చేయడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్ట్ అవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.
- 15వ తేదీన ఈ వ్యర్థాలను తగ్గించడం, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం చేయాలి.
- 18వ తేదీన స్థిరమైన ఆహార వ్యవస్థ, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్కల పెరుగుదల, పర్యావరణ ప్రయోజనాలపై చర్చించడం చేయాలని తెలియజేశారు.
- 19వ తేదీన ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, నేచర్ వాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



దిమిలి గ్రంథాలయంలో విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్స్ నీతి కథలు చెప్పారు. ఈ కథల్లో నీతిని పాటించాలని సూచించారు. పేపర్‌క్రాఫ్టులు, కోలాటాలపై అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా ఈ వేసవి శిక్షణలో పాల్గొన్నారు. ఈ నెల 6న వేసవి శిక్షణ ముగుస్తుందని లైబ్రేరియన్ ఎస్. శకుంతల తెలిపారు.

బస్‌పాస్ కౌంటర్‌కు సెలవు

సింహాచలం: ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీ చేసే అప్లికేషన్‌ను ఆధునికీకరిస్తున్న కారణంగా సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న బస్‌పాస్ కౌంటర్‌కు ఈనెల 6,7తేదీల్లో సెలవు ప్రకటించినట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు.

హనుమాన్ కాలనీలో తాగునీటి ఎద్దడి

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం శివారు హనుమాన్ కాలనీలో కొన్ని రోజుల నుంచి మంచి నీటి ఎద్దడితో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించడానికి చర్యలు తీసుకోలేదని కాలనీకి చెందిన హనుమాన్ యూత్ సభ్యులు ఆరోపించారు. కాలనీలో ఏర్పాటు చేసిన రెండు మంచినీటి పథకాల్లో ఒకటి మరమ్మతులకు గురైంది. ఒక్క బోరు బావే ఉండడంతో వేసవికాలంలో తాగునీటి కోసం పరవాడలోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మికి రెండు నెలల కిందట వినతి పత్రం అందజేసినా చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని హనుమాన్ యూత్ సభ్యులు కోరారు.

అడుగడుగునా పోలీసుల నిఘా



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

సబ్బవరం: ఎన్నికల కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వెలువడడంతో పార్టీల మధ్య వివాదాలు తలెత్తకుండా మంగళవారం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉండంతో ఎటువంటి విజయోత్సవ సంబరాలు, ఊరేగింపులు జరగకుండా గస్తీ నిర్వహించారు. విజయోత్సవంలో భాగంగా వివాదాలు, గొడవలకు దిగకుండా గ్రామాల్లోని రాజకీయ పార్టీల నేతలు హుందాగా వ్యవహరించాలని సీఐ పిన్నింటి రమణ సూచించారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో పోలీసులు పహారా కాశారు.

టీవీలకు అతుక్కుపోయిన జనం

యలమంచిలి రూరల్ : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ఫలితాల తీరు వీక్షించేందుకు ఉదయం నుంచే టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయారు. ఎక్కడ ఎవరికి అనుకూలంగా ఓట్లు పడ్డాయి, ఏ పార్టీ ఎన్ని సీట్లలో అధిక్యంలో ఉంది, రౌండ్ల వారీగా మెజార్టీలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఆఖరి రౌండ్ వరకు ఎన్నికల ఫలితాలను తమ ఫోన్లలో వాట్సాప్ వేదికగా ఇతరులతో పంచుకునేందుకు ఉత్సాహం కనబరిచారు. ఫలితాలు ప్రకటించగానే, తమ వాట్సాప్ స్టేటస్‌లలో పోస్ట్ చేస్తూ సమాచారం అందరికీ చేరవేయడం కనిపించింది.